## క్లుప్తంగా

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. మండలంలోని ఉలిగేపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అలంపూర్ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి ప్రసూణరాణి అన్నారు. క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటికెళ్లి నీటి తొట్లు, డ్రెయినేజీల్లో దోమల నివారణ మందు చల్లారు. అదేవిధంగా కుష్ఠుపై సర్వే నిర్వహించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పేర్లు నమోదు చేస్తున్నట్లు నోడల్ అధికారి బాలీశ్వరయ్య తెలిపారు.

### కొనసాగుతున్న సప్తాహ భజనలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజన కార్యక్రమం కొనసాగుతోంది. స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సప్తాహ భజన కార్యక్రమంలో పాల్గొని సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దు

అలంపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని ర్యాలంపాడ్, సుల్తాన్‌పూర్, జిల్లెలపాడు పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల పనితీరుతోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఎంఈఓ వెంట సీఆర్పీ ఈదన్న, వెంకటరమణారెడ్డి, త్యాగరాజు, ఫరీద్ ఉన్నారు.

### ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నందిన్ని ప్రకాష్‌రావు, బీజేపీ నాయకుడు రాంచంద్రారెడ్డి, అర్చకుడు చక్రపాణి జోషి, హన్మంతరాయ పాల్గొన్నారు.

### ‘గృహ నిర్బంధం సరికాదు’

గద్వాల అర్బన్: దళితబంధు పథకంలో జరిగిన అక్రమాలను తెలుసుకునేందుకు గజ్వేల్‌లోని తీగుల్ గ్రామానికి వెళ్తున్న వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకొని గృహ నిర్బంధం చేయడం సరికాదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతిఖుర్ రహ్మాన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. షర్మిల పర్యటనను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అయిజ: అంగన్‌వాడీ టీచర్లు నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి హెచ్చరించారు. మండలంలోని ఉత్తనూరు, భూంపురం, కొత్తూరు, కుటుకనూరు, సింధనూరు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు.



అయిజలో..



కేటీదొడ్డి మండలం చింతలకుంటలో..



శాంతినగర్‌లో..

# బహుజన వీరుడి ఆశయాలు సాధిద్దాం

- ఎమ్మెల్యే అబ్రహం
- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



అలంపూర్‌లో సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలు సాధిద్దామని ఎమ్మెల్యే అబ్రహం పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలను ఏకం చేసి బహుజన రాజ్యస్థాపన కోసం పోరాటం చేసిన యోధుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. అదేవిధంగా గౌడ సంఘం, బీఎస్పీ నాయకులు సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమేష్‌గౌడ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రాముడు, బీఎస్పీ మండల అధ్యక్షుడు సురేష్, కృష్ణగౌడ్, విజయ్, వెంకటేష్, సుంకన్న, దయాకర్, నాగరాజు, రవిప్రకాష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సర్పంచు శేషన్‌గౌడ్, శీనివాసులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ బహుజన వీరుడని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 23వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అదేవిధంగా బీఎస్పీ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, బుచ్చిబాబు, లవన్న, భీమన్‌గౌడ్, దస్తగిరిగౌడ్, గోపాల్, రాముడు, నేతన్న, విష్ణు, బలరాంనాయుడు, ఆశన్న, ఉపేంద్ర, మణికుమార్, ప్రకాష్, సవారన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో సర్వాయి పాపన్న జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయన్నగౌడ్, సిద్ధయ్యగౌడ్, వెంకట్రామాగౌడ్, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గట్టు: మండల కేంద్రంతోపాటు చానదోన గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, వెంకటన్నగౌడ్, మునిచంద్రగౌడ్, విజయ్‌గౌడ్, మహేష్, కార్తీక్, రామన్‌గౌడ్, ప్రవీన్‌కుమార్, పరమేష్, మధుగౌడ్, డీకే మురళి పాల్గొన్నారు.

శాంతినగర్: తహసీల్దార్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాధాకృష్ణగౌడ్, పరమేష్‌గౌడ్, వెంకట్రామన్‌గౌడ్, పాలరాముడు, వీరేష్‌గౌడ్, జయన్న, మధుసూదన్‌గౌడ్, మనోహర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, సురేష్‌గౌడ్, నర్సింహాగౌడ్, ఉషేనిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రభుదాసు అయ్యన్న, ఖాజా, మహేష్, నాగేంద్ర, శ్రీకాంత్, రాముడు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో బీఎస్పీ మండల కన్వీనర్ రవి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భోరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, జల్లాపురం బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో..



గద్వాలలో నివాళులర్పిస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు



మానవపాడులో..

# రైతు రాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

ధరూరు: రైతు రాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని మార్లబీడు గ్రామ రైతులు అన్నారు. పంట రుణాలను మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతు దేవదాసు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు తదితర పథకాల అమలుతోపాటు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాములు మాజీ ఎంపీటీసీ రోశన్న, తిమ్మారెడ్డి, హన్మంతురెడ్డి, రాఘవేంద్రారెడ్డి, ఆనంద్‌రెడ్డి, సవారప్ప, ఏసన్న సుధాకర్ పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

అలంపూర్ రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రోగ్రాం అధికారి రాజు అన్నారు. క్యాతూర్ పీహెచ్‌సీలో శుక్రవారం ఎన్‌సీడీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ సెంటర్లలో క్రమం తప్పకుండా బీపీ, షుగర్ ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో శ్యాంసుందర్, మక్సూద్, రమేష్, మల్లమ్మ, అక్కమ్మ ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి రాజు



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న షేక్షావలి ఆచారి

# బ్రిడ్జి నిర్మించండి

అయిజ: మండలంలోని దేవబండ పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలని పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దేవబండకు తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోగా.. గ్రామానికి చెందిన లక్ష్మన్న శుక్రవారం తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక మట్టిరోడ్డుతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని కోరారు. అనంతరం కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. స్థానిక రైతులు పండించిన కూరగాయలకు సరైన ధర చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, మధు, గాల్‌రెడ్డి, రాజు, ఈరన్నగౌడ్, శేఖర్గౌడ్, పరమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరుణదేవా.. కరుణించవా



మారమునగాల-2లో కృష్ణమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఉండవెల్లి: వరుణదేవుడి కరుణ కోసం మండలంలోని మారమునగాల-2 గ్రామంలో శుక్రవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు ఎద్దుల కాడెలతో కృష్ణాజలాలు తీసుకొచ్చి అభిషేకాలు చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



కృష్ణాజలాలు తీసుకొస్తున్న రైతులు

### ఉత్సాహంగా క్రీడాపోటీలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 36 జట్లు పాల్గొని తలపడినట్లు పీడీ భరత్‌కుమార్ తెలిపారు.

### ఎల్‌ఓసీ అందజేత

అలంపూర్/ఎర్రవల్లి చౌరస్తా: అయిజ మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన రామకృష్ణకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్షా 50వేల ఎల్‌ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే అబ్రహం అందజేశారు. యాక్తాపురం గ్రామానికి చెందిన ఎర్రవల్లి ఎంపీటీసీ లక్ష్మి తల్లి సుభద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

### నలుగురికి జరిమానా

గద్వాల క్రైం: మామిడిపండ్లను చోరీ చేయడంతోపాటు యజమానిపై దాడికి పాల్పడిన నలుగురికి శుక్రవారం గద్వాల అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఏపీపీ భవని వివరాల మేరకు.. మల్దకల్ మండలం తాటికుంట గ్రామ శివారులో 2018లో తెలుగు వెంకటేష్ మామిడి తోటను కౌలుకు తీసుకున్నాడు. అదే మండలానికి చెందిన కుర్వ గోపాల్, రాముడు, కుర్వ పరుశరాముడు, తిమ్మప్ప మామిడితోటలో పండ్లను చోరీ చేసేందుకు వచ్చి వెంకటేష్‌పై దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. కేసు విచారణలో పోలీసు సిబ్బంది కృషి అభినందనీయమని ఏపీపీ తెలిపారు.

### ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

అలంపూర్ రూరల్: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రమేష్ సూచించారు. పట్టణంలోని తెలంగాణ టూరిజం సర్కిల్‌లో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించడంతోపాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తెలిపారు. ఎవరైనా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని భైరాపురం గ్రామానికి చెందిన రాములమ్మపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. భైరాపురం గ్రామానికి చెందిన బలరాముడు, జయరాముడు, శ్రీరాములు, మధు, భాగ్యమ్మ, రాజేశ్వరి పొలం విషయంలో రాములమ్మపై గొడవ పడి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# విద్యాభివృద్ధికి ఆదిలక్ష్మీదేవమ్మ కృషి మరవలేనిది



ఆది లక్ష్మీదేవమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంస్థానాధీశులు, అధ్యాపకులు

గద్వాల అర్బన్: విద్యాభివృద్ధికి మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ చేసిన కృషి మరవలేనిదని ఎంఎల్‌డీ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహులు, లవీన మంజులత అన్నారు. శుక్రవారం మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ వర్ధంతిని పురస్కరించుకొని రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్‌డీ డిగ్రీ కళాశాలలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాణి లక్ష్మీదేవమ్మ నిజాంకు వ్యతిరేకంగా నిలిచి విద్వత్ గద్వాలగా పేరు తెచ్చిన వీరవనిత అని కొనియాడారు. అనంతరం సంస్థానాధీశులు విక్రమసింహారెడ్డి, సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యనభ్యసించి మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, సత్యన్న, హరినాగభూషణం, రెడ్డి సేవాసమితి నాయకులు రంగారెడ్డి, రాధ పాల్గొన్నారు.

# అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



అయిజలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ చిన్నదేవన్న



అలంపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

అయిజ: గృహలక్ష్మి పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ మాల నర్సింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో గృహలక్ష్మి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ మాట్లాడుతూ సొంత జాగ ఉండి.. ఇల్లు లేని పేదలు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణం, మండలంలో వచ్చిన గృహలక్ష్మి పథకం దరఖాస్తులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారుల నివాసగృహాల స్థితి, స్థలం, ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. మొత్తం 2,448మంది దరఖాస్తు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు.

ధరూరు: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు పద్మమ్మ, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: గృహలక్ష్మి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. ఇటిక్యాల మండలం కొదండాపురంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డితో కలిసి దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. గృహలక్ష్మి పథకంలో అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

# సెకండ్ ఏఎన్‌ఎంలతో వెట్టిచాకిరి



సమ్మె శిబిరంలో పాల్గొన్న నాయకులు

గద్వాల అర్బన్: సెకండ్ ఏఎన్‌ఎంలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతిఖుర్ రహ్మాన్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న అన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరింది. ఏఎన్‌ఎంల సమ్మెకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రజారోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదన్నారు. కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఏఎన్‌ఎంల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఏఎన్‌ఎంల తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జ్యోతి, సరస్వతి, రేణుక, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

# పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



శాంతినగర్‌లో గేదెకు టీకా వేస్తున్న సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో శుక్రవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, వెటర్నరీ సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, రవి, కృష్ణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని ఉప్పల, భూంపురం గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో 392 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశబూరు. వ్యాక్సినేషన్ ప్రక్రియ ఈనెలాఖరు వరకు కొనసాగుతోందని, పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు.

# చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మానవపాడు: చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లలను గుర్తించి పోషకాలు కలిగిన ఆహారం అందించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో అస్మా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీధర్

అలంపూర్: విద్యుత్‌శాఖ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎంప్లాయిస్ యూనియన్-327 సబ్ డివిజన్ అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో శుక్రవారం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జేఏఓ ప్రసాద్, సహాయ కార్యదర్శిగా యుగంధర్‌రెడ్డిని ఎన్నుకోగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### విచారణ పూర్తి

అయిజ: పట్టణంలో ఇళ్ల అనుమతులపై డీటీసీపీ అధికారులు చేపట్టిన విచారణ శుక్రవారంతో ముగిసింది. మున్సిపాలిటీలో నిర్మించిన ఇళ్లకు సంబంధించిన అనుమతులపై రెండు రోజులపాటు విచారించారు. మొత్తం 20 ఇళ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీసీపీ రీజినల్ డైరెక్టర్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సత్యభామ, టీపీఓ కుర్మయ్య, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.